సమాజంలో నిత్యం బాధలకూ, అవమానాలకూ గురికావడమేకాక, అధికారుల పీడనకు యెరలయే జరిమానా బ్రతుకుల జాలి కథ!

# జరిమానా


## రామచంద్రమౌళి

అయిలయ్య చెక్క బెంచీపై ముసలి కోతిలా ముడుచుకుని కూర్చున్నాడు.

మొట్టమొదటిసారి పామును చూసిన పసివానిలా అతనా కోర్ట్ వాతావరణాన్ని చూసి భయపడ్డాడు.

తనో పాముల పుట్టలోకి చొచ్చుకొచ్చి కూర్చున్నట్టు అదిరిపడుతున్నాడతను.

నల్ల కోట్లు వేసుకుని అటు, యిటూ తిరుగుతున్నవాళ్ళు నవ్వుతున్న యమభటుల్లా కనిపిస్తున్నారు అయిలయ్యకు. తనలా ఏ పనుల మీదనో వచ్చి పడిగాపులు గాస్తున్నవాళ్ళు రావణుని రాజ్యంలో బందీలైన నవగ్రహ గణాల్లా కన్నుల్లో ప్రాణాలను పెట్టుకుని పంజరంలో పక్షుల్లా చూస్తున్నారు. అక్కడక్కడ తిరుగుతున్న పోలీసులు నాలుకలు చాపుకూర్చున్న బల్లుల్లా అతిగంభీరంగా కనబడుతున్నారు.



ఉదయం పది గంటల నుంచి కూర్చున్న అయిలయ్య విసిగి విసిగి సాయంత్రం నాలుగ్గంటల వరకు ఓ పాతిక బీడీలనూ రెండు అగ్గిపెట్టెలనూ కాల్చి ఓ కానిస్టేబుల్‌కు నాల్గు చాయ్‌లు తాగించి దోస్తీ చేసి కొన్ని కొత్త బూతులు నేర్చుకున్నాడు.

"ఏ జన్మలో ఏ పాపం చేసిన్నో యీ రోజు ఉమ్మిలోపడ్డ యీగలా యీ కోర్టులో చిక్కి ఏడుస్తానా" అని తుపుక్కున ఉమ్మేసి యిరవయ్యారో బీడీని అంటించుకున్నాడు.

"....హాజిర్ హో...." అని అరిచాడు మళ్ళీ బంట్రోతు.

బంట్రోతును చూచినప్పుడల్లా తన గుడిసెపక్కనున్న రైస్‌మిల్లు చిమ్నీ గొట్టం జ్ఞాపకమొస్తోంది అయిలయ్యకు చటుక్కున.

ఎవరో పరుగు పరుగున వెళ్ళారు జడ్జిగారున్న గదిలోకి సర్కస్ బోన్‌లోకి నడుస్తున్న జంతువులా.

యింతలో ఓ పోలీసు వ్యాన్ సర్రున దూసుకొచ్చింది మెట్ల దగ్గరికి.

ఓ పోలీసు గబగబా దిగివచ్చి వెనుక డోర్ తెరిచాడు.

ఓ ఏడెనిమిది మందున్న ఆడవాళ్ళ గుంపు దిగింది.

ఒకటి రెండు మూడు అందరినీ పరిశీలనగా చూశాడు అయిలయ్య. అందరి ముఖాలూ చెదలు పట్టిన కర్రల్లా వున్నాయి. వాంట్లో దాదాపు అందరూ పాన్‌లు నములుతున్నారు. అందువల్ల వాళ్ళ నోళ్ళన్నీ పామునుతిన్న ముంగిస మూతుల్లా ఎర్రగా వున్నాయి. కాని వాళ్ళముఖాల్లో ఏమాత్రం బాధలేదు. సంతోషంగానే కనిపిస్తున్నారు.

ఆడవాళ్ళంతా వరుసగా వచ్చి నిలబడ్డారు అయిలయ్య కూర్చున్న బెంచీ ప్రక్కన.

"ఏంది సంగతి" అన్నాడు పోలీస్ దోస్తీతో.

"కంపిని సరుకు"

"ఓ—"

మళ్ళీ "సరుకు" ముఖాల దిక్కు చూశాడు.

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ సూపం వినా భోజన మప్రశస్తం।
యూపం వినా యాజన మప్రశస్తం।
ధూపం వినా పూజన మప్రశస్తం।
దీపం వినా మైథున మప్రశస్తం॥

పప్పు లేని భోజనం. యూప స్తంభంలేని యజ్ఞం, ధూపం లేని పూజ, దీపం లేని రతిక్రీడ అప్రశస్తాలు—అంటే ప్రశస్తమైనవి కావు సుమా!

కంఠస్థం చేయాలి

"ఎందుకొచ్చిండ్రిక్కడికి"

"రాలేదురా ఎదవనాయాలా. పట్కొచ్చిండ్రు. యియ్యాల తారీకెంత....యిరవయ్యారు. పోలీసుల కేస్‌ల కోటా నిండవల్సున్నది. నింపుతాండ్లు—"

"మరిప్పుడేం జేత్తరు"

"ఏమున్నది బే. కొడ్తరా. సంపుతరా. నీ లెక్కనే వాళ్ళదీ ఓ కేసే. జడ్జి అడుగుతడు. పైసేత్తడు. పొమ్మంటడు. మిరందరు పైసు కట్టాలె. పోవాలె-గంతే"

"ఆ పెంక"

"వాళ్ళు మల్లా కంపిని నడిపిస్తరు. నువ్వు మల్లా నడిరోడ్డు మీద'నీ పండ్లబండి పెట్టి యిల్లెక్కి కూసే పుంజోళ్లె. అమ్ముకుంటే—"

"మరి ఓ కోరు బెందుకు. పైనెందుకు—జడ్జెందుకు"

"అదీ....అదంతే...."

"థూ....దీనమ్మ....ఏం కానూనిది.మనిషిని మారుస్తాది బే కానూన్. అంతా బూటకం—"

"ఒరే ఎలిగా.... కానూన్ గాదురా....ఈ మన జిందగీ ఉన్నది సూసినావ్ ఆ బ్రతుకే ఓ బూటకంరా" పోలీస్ శివయ్య వేదాంతిలా నవ్వాడు.

అయిలయ్య చేతిలోని బీడీని బెంచీ చెక్కకు రాసి నులిమి బయటికి విసిరేసి తనకు దగ్గరగా దాదాపు తన ఒంటిని తాకుతున్నట్టుగా నిలబడ్డ "సరుకు" బాపతు ఆడ మనిషి దిక్కు చూశాడు.

"ఏందీ సంగతి. ఈడకూడా గిరాకీ కోసం సూత్తానవా" అన్నాడు చటుక్కున.

ఆమె ఉలిక్కిపడి అయిలయ్య దిక్కు చూచి మంట తాకిన మనిషిలా ప్రక్కకు జరిగింది "నీ పేరేంది...." అన్నాడు.

"...." ఆమె చెప్పలేదు. నిశ్శబ్దంగా చూచింది.

"అయ్యో చెప్పరాదో...." ఊరి చెరువు మీద ఊళ్ళోని ప్రతివానికీ హక్కువున్నట్టు ఆమెమీద తనకు తెలియకుండానే తనకు సంక్రమించిన హక్కుతో అడిగాడు అధికారంగా.

"జయమ్మ" అంది ముఖం అటు తిప్పుకుంటూ.

అక్కడున్న ఎనిమిదిమంది ఆడవాళ్ళలోనూ జయమ్మే వయసుగా వుంది. కొత్తగావుంది. వినయంగా వుంది. అయిలయ్యకు ఆశ్చర్యమేసిన యింకో విషయమేమిటంటే జయమ్మ మిగతా వాళ్ళతో కలిసి ఉండడంలేదు. వాళ్ళతో కాకుల మందలో కలిసిన కోకిలలా విడిగా ముభావంగా వుంటోంది.

"నీది వాళ్ళ కంపిని కాదా"

"కాదు—"

"ఒక్క దానివి వేరేనా"

"మావోళ్ళెవరూ లేరు. నన్నొక్క దాన్నే పట్కొచ్చిండ్లు."

"కచ్చీరు కచ్చినవా యిదివరకు"

"ఊహూం.... యిదే మొదలు"

"అచ్చా.... మరి యీడ పైనేస్తే ఎవలు కడ్తరు"

"మా మనిషి యిప్పుడచ్చి ఓ ముప్పయి రూపాలిచ్చి పోయిండు. పైనేస్తే కట్టి యిడిచేస్తే మల్లా మావటికి వాళ్ళ దగ్గరికి పోవాలె"

"పోకుంటేమైద్ది"

"అబ్బో.... నన్ను మల్ల ఎంకులాడి పట్కొచ్చి గొడ్డును కొట్టినట్టు కొడ్తరు"

"యిగ నువ్వు యీ పనినుంచి బైట పడ లేవా—"

"ఊహూం.... కత్తుల బోన బడ్డ్లే.,నా బతుకే నాశనమైపోయింది." ఆమె ముఖం పలుగురాయిలా వున్నదల్లా కరుగుతున్న మంచుగడ్డలా ఐపోయింది.

"ఎలయ్యా హాజరే...." అని అరిచాడు బంట్రోతు,


జూన్ 78 బహుమతులు పొందినవారు

1) పి. వై. పద్మావతి, పుంగ్యా. 2) రథోడ్ రామ్‌జీబాయ్ లాధుబాయ్, భవ్‌నగర్. బహుమతులు : వాచ్, కెమేరా, టేపురికార్డర్, రికార్డుప్లేయర్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్-(మా అభీష్టంపై ఏదో ఒక బహుమతి) కన్సొలేషన్ లేక మూడవ బహుమతి : అమెరికన్ జార్జెట్ లేక ఆర్ట్ సిల్కు చీర ధర రు. 60/- ఇది అమ్మకం అభివృద్ధి పథకం. ప్రమోటర్ల తీర్మానం న్యాయమైనది మరియు చట్టబద్ధమైనది మరియు అది ఈ పోటీకి స్పష్టమైన షరతు అయి వున్నది.

| | | | |
|---|---|---|---|
| 18 | 23 | 16 | 21 |
| 27 | 12 | 25 | 14 |
| 20 | 19 | 22 | 17 |
| 13 | 24 | 15 | 26 |

నిబంధనలు : తెల్లకాగితముపై గడులను నమూనాలో వున్నవిధంగా తయారుచేసి 13 నుండి 28 వరకుగల అంకెలను ఒకేసారి మాత్రమే వాడి ఎటు కూడినా మొత్తం 82 వచ్చునట్లు వేయాలి. 2. బహుమతి గెలిచినవారికి పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. 3. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 4. మా కార్యాలయమునకు మొదటగా చేరిన ఎంట్రీకు ప్రత్యేక బహుమతి ఇవ్వబడును. 5. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి. వివాదములు ఆలీఘర్ జ్యూరీస్ డిక్షన్‌లో మాత్రమే పరిష్కరింపబడును.

స్వహో మునకు 78

ఆఖరి పోస్టింగ్ తేదీ : 24-8-78

ARVIND TEXTILES (AJSV-82) P. B. No. 88, Aligarh-202001.

"పోవో....నువ్వే....వచ్చింది నీ పేసి...." అన్నాడు పోలీసు అయిలయ్యను చేతిలోని కర్రతో పొడుస్తూ.

"వచ్చె—"

లేచి మాసిన అంగీని దులుపుకుంటూ బంట్రోతు దగ్గరికి ఉరికి....వాడు చూపించిన హాల్లోకి నడిచి చాకలివాని ముందర గాడిదలా అతి వినయంగా నిలబడ్డాడు.

ముందర నల్లకోటు వేసుకున్న ప్రాసిక్యూటర్ కరువబోయే పాములా ఉన్నాడు.

ఎదురుగా జడ్జి ఎవని ఎడ్పు పట్టించుకోని రాతిదేవునిలా నిర్మలంగా కూర్చున్నాడు.

"అయిలయ్య నువ్వేనా—" ప్రాసిక్యూటర్ ప్రశ్న.

"ఔన్సార్"

"రోడ్డు మీద బండిపెట్టి పండ్లమ్మావా"

"ఔన్సార్"

"పది రూపాయలు కట్టిపో" రాతి దేవుడు మాట్లాడాడు.

"కని.. సార్ మరి నాకుడు బండ్లోళ్లం రోడ్డుమీదగాకుంటే మరి ఎక్కడమ్ముకోవాలె"

"ఎదురు ప్రశ్నేస్తాన్నావ్...." ప్రాసిక్యూటర్.

"పది రూపాయలు ఫైన్" రాతి దేవుడు—

"అదిగాదు సార్...." యింకేదో అనబోతూండగా....

"పదిహేను రూపాయలు.." అన్నాడు జడ్జి కఠినంగా.

అయిలయ్య బాణం దిగిన పక్షిలా చూచి.... నోరు మూసుకుని.... చిరుగుల సద్ద జేబులో నుంచి మాసిపోయిన పదిహేను చిల్లర నోట్లను క్లర్కు దగ్గర కట్టి స్మశానంలో నుంచి వస్తున్న మనిషిలా బయటికొచ్చాడు.

అతను బయట కొస్తూండగా—

"జయమ్మా హాజరే" అని అరుపు వినబడింది.

అతను చూస్తూండగానే జయమ్మ లోపలికి వెళ్ళింది సర్కస్‌లో ప్రేక్షకుల ముందు నుండి బోనులోకి పోతున్న జంతువులా.

అయిలయ్య వచ్చి అరుగుపై నిలబడి ఆకాశంలోకి చూస్తూ వుండిపోయాడు.

ఐదు........మాట్లాడితే పది....యింకా మాట్లాడితే పదిహేను. యింకా మాట్లాడితే....?

ఐదు .. పది....పదిహేను.

"థూ! వీ నల్లి ఏం నాయం యిది."

ఒకటి... రెండు....మూడు పది నిముషాలు గడిచాయి.

జయమ్మొచ్చింది.

ఆమె ముఖంలోకి చూశాడు మురిగిన పండులావుంది.

"ఏమైంది" అన్నాడు.

"పది దినాలు జెలన్నా....యిరవై ఐదు రూపాల్ జుల్మానన్నా కట్టుమన్నడు".

"ఊఁ...."

"యిరవై ఐదు కట్టిన"

తర్వాత అతను మాట్లాడలేదు. ఆమే మాట్లాడలేదు.

....నిశ్శబ్దం యిద్దరి నడుమ.

"యిగ పోదాం...." అంది కాస్సేపయింతర్వాత.

"ఏడికి"

"నేను మల్ల ఆ నరకంలకు పోతా...."

"ఆగు—"

అప్పటికే ఐదున్నరై పోయింది. చాలా మంది జనం వెళ్ళిపోయారు. నల్లబట్టలేసుకున్న లాయర్లందరూ వెళ్ళిపోతున్నారు కార్లలో.

పరిశీలనగా చూస్తున్నాడు అయిలయ్య పోతున్న నల్లకోట్ల వంక— ఓ ఐదు నిమిషాల తర్వాత ఓ గున్న ఏనుగులాంటి మనిషి కారు దగ్గరికి వస్తూంటే.

"అయి నెవ్వరు...." అన్నాడు అయిలయ్య జయమ్మకు చూపిస్తూ.

"ఇంతకుముందు మనకు జుల్మానేసిన జడ్జి...."

"పా...." అని గబగబా నడిచాడు ఆమె వెంట నడిచింది.

అతను జడ్జిగారి కారుకు ఎదురుగా నిలబడ్డాడు.

"ఏందిరా" అన్నాడు జడ్జిగారు.

"అయ్యా .... మాకు యింతకుముందు జుల్మా నేసిండ్లుగదా నేను రోడ్డుమీద బండి పెట్టుకోని అమ్ముకున్నందుకు, యిది ఒళ్ళమ్ముకున్నందుకూ."

"ఐతే ఏమిటి."

"మరి రేపటినుంచి మేమేం జేయాలె"

"ఏం జేస్తరు....మళ్ళీ నువ్వు పండ్లమ్ముకో, అది ఒళ్ళమ్ముకుంటది."

"మల్లా పట్కలై."

"మళ్ళీ ఫైనేస్తా"

"మరి మీరీ ఫైనెందుకేత్తానట్టు—"

"అది నా డ్యూటీరా పిచ్చివాడా. రోడ్డు మీదబడి బతకడం నీ డ్యూటీ. నిన్ను పట్టుకు రావడం పోలీస్ వాళ్ళ డ్యూటీ. మీకు ఫైన్ వేయడం నా డ్యూటీ...."

"యిగ మా బతుకులన్నీ ఫైన్లేనా... యీ జుల్మానా బతుకునుంచి మమ్మెలి రచ్చించండ బాబూ—"

"ఎవళ్ళా రక్షించేది.... ఏడ్వండి రోడ్ మీదపడి.... డ్రైవర్, పోని...."

కారు బాణంలా దూసుకుపోయింది.

నిలబడ్డ యిద్దరి కళ్ళలోనూ దుమ్ము పడింది పూర్తిగా. ★

ఉచితం! ఉచితం!!
కలం — స్నేహం
పల్లెలనుండి, పట్నవాసాల నుండి మిత్రుల [స్త్రీ-పురుషుల]ను పొంది సహకారములు ఆనందము పొందవచ్చును. సభ్యత్వంతో నవలలు ఉచితముగా ఇవ్వబడును. వివరములకు 50 పై. స్టాంపులు పంపండి.
దేశ సేవ కలం—
స్నేహితుల సంఘం,
మగటపల్లి 533 248. తూ గో జిల్లా.

ఫ్రెంచి
ఉచిత పోస్టలు ట్యూషను 4 మాసముల సర్టిఫికెట్ కోర్సు. వివరములకు సొంత చిరునామా కలిగిన పోస్టలు కవరు పంపండి.
Principal
IMPERIAL INSTITUTES (PLF)
Doriwala Delhi-5

డా॥ పి.వి.కె.రావ్ R.A., సెక్స్ స్పెషలిస్ట్

ద్యవిద్వాన్- వైద్యాచార్య. స్వప్రయోగం, నరముల బలహీనత, అంగముచిన్నది శీఘ్రస్ఖలనము- శుక్లక్షయము మొ॥ రోగములకు ... వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టుద్వారా కూడా చికిత్స కలదు.
రావు ... నిక్
టి. బి. రోడ్ తెనాలి. ఫోన్ 700

SUVARNA

దేవి మిట్లు REGD.
బాధించే ముఖ్యంగా అలక్ష్యమైన్.
క్రమముగాకాక పోయిన బాధతో కూడిన.
శేక ఆగిపోయినబహిష్టుకు
SEALED PACKING ... TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs.: SEENU & CO. MADRAS-21